నిర్మల్ టౌన్ : మాట్లాడుతున్న నిర్మల్ జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు

అవిశ్వాస తీర్మానంపై పుకార్లు నమ్మవద్దు

- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం.. కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తాం..
- నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 26 : నిర్మల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అదంతా అబద్ధమని బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని దివ్యగార్డెన్‌లో జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ సాగరబాయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సమావేశమయ్యారు. రెండు, మూడు రోజులుగా జడ్పీ చైర్‌పర్సన్, ఆయా మండలాల ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానమంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని, కేసీఆర్ ఆదేశాల మేరకే నడుచుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ నాయకులతో కలిసి పార్టీ పురోగతికి పాటుపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు కళావతి, శ్రీనివాస్ రెడ్డి, శారద, జానకీబాయి, రాజమణి, అరుగుమీది రామయ్య, సరోజిని భోజారెడ్డి, కొత్తపల్లి గంగామణి, అల్కాతాయి, ఓస రాజేశ్వర్, డాక్టర్ సుభాష్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పగలంతా ఇగం

ఆదిలాబాద్ పట్టణంపై కమ్ముకున్న పొగమంచు

ఆదిలాబాద్ జిల్లావాసులను చలి గజగజ వణికిస్తున్నది. పది రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం ఉదయం కనిష్ఠంగా 9.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సాధారణంగా ఉదయం 8 గంటల వరకు.. సాయంత్రం 6 గంటల తర్వాత మంచు అధికంగా ఉంటున్నది. ఈ నాలుగైదు రోజుల నుంచి పగలు కూడా పొగమంచు ఉంటున్నది. మంచుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు స్వెట్టర్లు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. *- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 26*

ఉద్యోగం పేరిట ఊడ్చేస్తారు..

'ఆన్‌లైన్'లో జాబ్స్ కోసం వేతికేవాళ్లు తస్మాత్ జాగ్రత్త

- తక్కువ పని, ఎక్కువ ఆదాయం అంటూ ఆకర్షించే యత్నం
- క్లిక్ చేశామా.. బ్యాంక్ ఖాతాలోని డబ్బులు మాయం
- జాబ్ ఫ్రాడ్‌తో ఇబ్బందులు పడుతున్న యువత

మంచిర్యాల, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్ట్ టైమ్, ఫుల్ టైమ్ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్న పేద యువకులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. తక్కువ పని, అధిక ఆదాయం అంటూ పోస్టులు పెడుతూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ప్రకటనలు నమ్మి ఉద్యోగం కోసమని ఆన్‌లైన్‌లో క్లిక్ చేస్తే.. మన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఊడ్చేస్తున్నారు. ఆన్‌లైన్ వర్క్, టాస్క్‌లు అంటూ పెట్టుబడి పెట్టించి మోసం చేస్తున్నారు. ఇలా.. భారీగా ఆదాయం అంటూ ప్రకటనలు ఇస్తున్నారంటే దాని వెనుక సైబర్ నేరగాళ్లు ఉన్నారనే విషయాన్ని గ్రహించాలని భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి గూగుల్‌లో సెర్చ్ చేసి మన మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్ ఇచ్చామా అంటే అంతే సంగతులు. ఉద్యోగాల పేరిట మెయిల్‌కు మొబైల్‌కు లింక్ పంపిస్తారని, వాటిని ఏ మాత్రం క్లిక్ చేసినా మన సమాచారం మొత్తం తెలుసుకుని అకౌంట్‌లోని డబ్బులను ఊడ్చేస్తారని హెచ్చరిస్తున్నారు. మన వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ అన్ని వారి చేతుల్లోకి వెళ్లిపోతాయి. కొద్దిపాటి జాగ్రత్తలతో నేరగాళ్ల భారీ నుంచి కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు..

- ఆన్‌లైన్ జాబ్ పేరిట ఒక పనికి సాధారణం కంటే అధిక వేతనం ఇస్తామనే ప్రకటలను మోసమని గుర్తించాలి. అలాంటి సైట్‌ను ఓపెన్ చేయవద్దు. ● ఈ-మెయిల్స్‌లో అక్షర దోషాలు, ఫోన్ నంబర్లు లేకుండా ఉంటే అది కచ్చితంగా మోసపూరితమైన లింక్ అని పసిగట్టాలి. ● ఆన్‌లైన్, జూమ్ కాల్స్ ఇంటర్వ్యూలు చేస్తామంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దు. ● వ్యక్తిగత సమాచారంతోపాటు పాన్, ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు ఇవ్వాలని అడిగారంటే అది మోసమని గుర్తించాలి. ● ఆకర్షణీయమైన ప్యాకేజీ అంటూ ప్రకటనల రూపంలో వచ్చే వెబ్‌లింక్‌లను ఓపెన్ చేయవద్దు. ● మనల్ని పెట్టుబడి పెట్టామన్నారంటే అది పెద్ద మోసమని గ్రహించాలి. ● నౌకరీ డాట్.కామ్, లింక్‌డ్ ఇన్, ఇన్‌డీడ్ వంటి వెబ్‌సైట్ల ఆధారంగా జాబ్ వెతుక్కోవాలి.



పార్ట్‌టైమ్ జాబ్ అంటూ ఒక యువకుడి వాట్సాప్‌కు వచ్చిన సందేశం

ఆదిలాబాద్‌కు చెందిన అఖిల హౌస్ వైఫ్. పార్ట్‌టైమ్ జాబ్ కోసం ఆన్‌లైన్‌లో కొన్ని వెబ్‌సైట్లు సెర్చ్ చేసింది. ఈ క్రమంలో రోజుకు రూ.3వేల నుంచి రూ.7,500 వరకు సంపాదించే జాబ్ ఉంది అనే బ్లాగ్ ఓపెన్ చేయగా.. అది డీటెయిల్స్ అడిగింది. మరుసటి రోజు వాట్సాప్‌లో ఒక సందేశం వచ్చింది. మీరు జూమ్ మీటింగ్ అటెండ్ అయితే మిగిలిన వివరాలు చెప్తామని చెప్పారు. అందుకు రూ.450 తీసుకున్నారు. మీటింగ్‌లో టైపింగ్ వర్క్ చేయాలని ట్రేయినింగ్ కోసం రూ.9 వేలు కట్టాలని చెప్పారు. విషయం ఆమె భర్తకు చెప్పడంతో ఉద్యోగం చేస్తే డబ్బులు ఇవ్వాలి. కానీ.. మనం డబ్బులు కట్టడం ఏంటని.. ఆ పని వద్దని చెప్పాడు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

మంచిర్యాల జిల్లాకు చెందిన కృష్ణ పని కోసం హైదరాబాద్ వెళ్లాడు. ఓ పెద్ద బ్యాంక్‌లో కార్ లోన్ల రికవరీ ఉద్యోగం దొరికింది. వారం రోజులకు ఓ కస్టమర్ నుంచి ఈఎంఐ డబ్బులు రూ.80 వేలు వచ్చాయి. రాత్రి పేమెంట్ చేతికి రావడంతో డబ్బులు తన అకౌంట్‌లోనే ఉంచుకున్నాడు. ఇంకా ఏదైనా పార్ట్‌టైమ్ ఉద్యోగం చేద్దామని గూగుల్‌లో సెర్చ్ చేశాడు. రోజుకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు సంపాదించవచ్చు అనే యాడ్ కనిపించింది. దానిపై క్లిక్ చేయగానే ఫోన్ నంబర్ అడిగింది. ఎంటర్ చేయగానే వాట్సాప్ సందేశం వచ్చింది. పార్ట్ టైమ్ జాబ్ రోజూ కొన్ని టాస్క్‌లు కంప్లీట్ చేస్తే టాస్క్‌కు కొంత చొప్పున డబ్బులు ఇస్తామని ఉంది. తొలి టాస్క్‌కు రూ.100 పెట్టుబడి పెడితే రూ.600 తిరిగి వస్తాయనే సందేశం వచ్చింది. రూ.100 కదా అని తొలి టాస్క్ పూర్తి చేయగా రూ.600 వచ్చాయి. అలా తరువాత టాస్క్‌ల నుంచి పెట్టుబడి పెరిగి వచ్చే అమౌంట్ పెరుగుతూ వచ్చింది. చివరకు బ్యాంక్ డబ్బుల నుంచి రూ.72 వేల పెట్టుబడి పెట్టాక టాస్క్ మధ్యలో ఇది పూర్తి చేయాలంటే మరో రూ.లక్ష కావాలనే సందేశం వచ్చింది. దీంతో హైరానా పడిపోయిన కృష్ణ ఏం చేయాలో తెలియక తెల్లముఖం వేశాడు. బయటికి చెప్తే పరువు పోతుందనుకొని మిన్నకుం డిపోయాడు. ఆఫీస్ డబ్బులు వాడుకున్నందుకు కృష్ణ ఉద్యోగం పోయింది. అప్పు చేసి బ్యాంక్ డబ్బులు తిరిగి కట్టాడు. స్నేహితులకు ఈ విషయం చెప్పుకొని బోరున విలపించాడు.

'ప్రజాపాలన'ను పటిష్టంగా నిర్వహించాలి..

- పంచాయతీ, మున్సిపాలిటీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలి..
- ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలి..
- 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలి..
- ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త

ఎదులాపురం, డిసెంబర్ 26 : ప్రజాపాలన కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త స్పష్టం చేశారు. మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ, వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు పనిదినాల్లో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో సభలు నిర్వహించి, ప్రజల నుంచి ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మండల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు మొదలగు పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని సూచించారు. గ్రామ సభల వద్ద టెంట్, తాగునీరు, ఇతర వసతులు కల్పించాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసేలా దరఖాస్తుదారులకు సూచించాలన్నారు. కౌంటర్ల వద్ద క్యూలైన్ విధానం పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో స్రవంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, హాజరైన అధికారులు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

సాత్నాలతో స్వర్ణయుగం

చివరి ఆయకట్టుకు అందుతున్న సాగునీరు

- రూ.28 కోట్లు మంజూరు చేసి మరమ్మతులు
- 24 వేల ఎకరాలకు అందుతున్న జలం
- కేసీఆర్ ప్రభుత్వ చలువే అంటున్న అన్నదాతలు

కాలువల ద్వారా పంటకు చేరుతున్న నీరు

ఆదిలాబాద్, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాత్నాల ప్రాజెక్టు ఆయకట్టు 24 వేలు కాగా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 14 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందేది. మిగతా 10 వేల ఎకరాల ఆయకట్టును రైతులు నష్టపోయేవారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినా ఉపయోగపడేది కాదు. ప్రత్యేక రాష్ట్రం సాకారం కావడం, కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగానే సాత్నాల ప్రాజెక్టును ఆధునికీకరించి, పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపట్టింది. ఫలితంగా ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 286.50 మీటర్లు కాగా.. 286.15 మీటర్ల వరకు నీరు ఉంది. వానకాలంలో వర్షపు నీటితో ప్రాజెక్టు నిండి వర్షపు నీటితో కళకళలాడేది. చెరువులు మత్తడి దుంకేవి. సాగునీటి, బోరు బావుల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి.

చివరి ఆయకట్టుకు నీరు

కేసీఆర్ ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టును ఆధునికీకరించింది. లక్ష్మీపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం పెరిగేలా పనులు చేపట్టింది. గతంలో లక్ష్మీపూర్ రిజర్వాయర్ నుంచి చివరి ఆయకట్టుకు నీరు అందేది కాదు. కాలువల లీకేజీలు, మిగతా నిర్మాణాలు సరిగా లేకపోవడంతో నీరు వృథాగా పోయేది. ఫలితంగా సగానికి పైగా ఆయకట్టుకు నీరు అందక పంటలు నష్టపోయేవారు. కేసీఆర్ ప్రభుత్వం కాలువలు, తూముల మరమ్మతులు, లైనింగ్, వాల్స్, డ్రాప్‌లు పూర్తి చేయడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందుతున్నది. దీంతో రైతులు రెండు పంటలు సాగు చేస్తున్నారు.

రెండు పంటలకు సాగునీరు..

నేను వానకాలంలో రెండు ఎకరాల్లో పత్తి పంట వేశా. కుడి కాలువ ద్వారా నీరు అందేది. యాసంగిలో శనగ వేశా. కాలువ ద్వారా ఈ పంటకు నీరు అందుతున్నది. కేసీఆర్ సర్కారు సాత్నాల ప్రాజెక్టు కింద లక్ష్మీపూర్ రిజర్వాయర్ నిర్మించడంతో మాలాంటి రైతులకు మేలు జరుగుతున్నది. రెండు పంటలు వేసుకో గలుతున్నాం.

- అశోక్, రైతు, పెండల్వాడ, జైనథ్ మండలం

కేసీఆర్ చలువే..

ఉమ్మడి రాష్ట్రంలో సాత్నాల ప్రాజెక్టు నుంచి కాలువలు సక్రమంగా లేక సాగు నీరు అందేది కాదు. నీరంతా వృథాగా పోయేది. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతు చేపట్టడంతో 24 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతున్నది. వానకాలం, యాసంగి పంటలకు అవసరమైన సమయంలో నీరు అందుతున్నది. వానకాలంలో పత్తి, సోయాబిన్.. యాసంగిలో శనగ, జొన్న, పల్లి పండిస్తున్నాం. ఇదంతా కూడా కేసీఆర్ చలువే.

- సతీష్, రైతు, సవర్‌గాం, జైనథ్ మండలం

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

శ్రీరాముడి జీవితం ఆదర్శం

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- భైంసా పట్టణంలో అయోధ్య అక్షింతల కలశ శోభాయాత్ర

భైంసా, డిసెంబర్ 26 : శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శమని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలోని భైంసా పట్టణంలో అయోధ్య అక్షింతల కలశ శోభాయాత్రను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముడి భవ్య మందిరం సాకారం కావడం హిందువుల స్వాభిమానికి సంకేతమన్నారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు జన సంపర్క్ అభియాన్ పేరిట ఇంటింటికీ అయోధ్య అక్షింతలు, కరపత్రాలు, చిత్రపటం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

సింగరేణి సమరం నేడే..

- 'గుర్తింపు' సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఓటు వేయనున్న 39,827 మంది కార్మికులు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల దాకా పోలింగ్
- అదే రోజు రాత్రి ఫలితాలు
- బరిలో 13 కార్మిక సంఘాలు

శ్రీరాంపూర్/మందమర్రి/రామకృష్ణాపూర్/సీసీసీ నస్పూర్/రెబ్బెన/తాండూర్, డిసెంబర్ 26 : సింగరేణిలో ఈ నెల 27న ఏడోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఆరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎలక్షన్లు ఉండనున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి. గుర్తింపు పోరులో మొత్తం 13 కార్మిక సంఘాలు పోటీ పడుతున్నాయి. మొత్తం 11 ఏరియాల పరిధిలో 39,827 మంది కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకోనుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 84 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇప్పటికే పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించి, శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. ఆర్టీవో, తహసీల్దార్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. పోలింగ్ రోజు ప్రతి ఉద్యోగి తమ గుర్తింపు కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు.

మందమర్రిలో..

మందమర్రి ఏరియాలో నాలుగు భూగర్భ గనులు, రెండు ఉపరితల గనులుండగా ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గనులతోపాటు ఏరియా వర్క్‌షాప్, వైద్య విభాగం, సివిల్ డిపార్ట్‌మెంట్, ఇతర డిపార్ట్‌మెంట్‌లలో మొత్తం 4,835 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు. ఏరియాలో 11 మంది పీవోలు, 11 మంది ఏపీవోలు, 22 మంది వివిధ శాఖల అధికారులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఈఆర్ క్లబ్‌లో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేశారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక వాహనాల్లో బూత్‌లకు తరలివెళ్లారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఆధ్వర్యంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ చంద్రకుమార్‌తోపాటు ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో 165 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. అన్ని చోట్ల 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

జైపూర్ ఏసీపీ పర్యవేక్షణలో బందోబస్తు

సింగరేణిలోనే పెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో 9,149 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఓటు వేసేందుకు శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికో ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇద్దరు ఇతర పోలింగ్ ఆఫీసర్లను కేటాయించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో జైపూర్ ఏసీపీ మోహన్ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌కు బ్యాలెట్ బాక్సులు తరలించనున్నారు. ఇక్కడే కౌంటింగ్ నిర్వహించనున్నారు. జైపూర్ ఏసీపీ మోహన్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

బెల్లంపల్లి ఏరియాలో..

బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్‌లలో 996 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఏరియాలో మొత్తం 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బూత్‌కొకరి చొప్పున ఐదుగురు పీవోలు, ఒక రిజర్వ్ అధికారి, ఐదుగురు ఏపీవోలు, 10 మంది అదనపు ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ ఆఫీసర్లు, కౌంటింగ్ కోసం నలుగురు సూపర్‌వైజర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ కేజే మహంతి తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతున్నదని తెలిపారు. 5 పోలింగ్ కేంద్రాలతోపాటు కౌంటింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కేజే మహంతి పరిశీలించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ, ఆరుగులు ఎస్ఐలు, 50 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. రెబ్బెన ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ చంద్రశేఖర్, ఏరియా ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఐఈడీ ఆధికారి ఉజ్వల్‌కుమార్‌బెహరా, సెక్యూరిటీ అధికారి వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో మండల శ్రీనివాస్ ఉన్నారు.

సీసీసీ సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ హాల్‌లో కౌంటింగ్‌కు ఏర్పాట్లు